# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భవిష్యత్తు హరిత నగరంగా అమరావతిని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.**
3. **ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకంపై అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**
4. **ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లోకమాన్య బాలగంగాధర తిలక్ జయంతి ఈరోజు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

భవిష్యత్తు హరిత నగరంగా అమరావతిని నిర్మించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో ఇన్వెస్ట్ ఇండియా, భారత పరిశ్రమల సమాఖ్య- సీఐఐ ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ -యూఏఈకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చించేందుకు 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ' సదస్సు ఈరోజు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ.. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర అనుకూలమని చెప్పారు. మెరుగైన సదుపాయాలతో అమరావతి గొప్ప నగరంగా నిలవనుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 34 సెకన్లు

----------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్. ఎం.డి. ఫరూక్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి. పొంగూరు నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

----------------------------

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిజిల్లా రేణిగుంటలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సహకాలతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, ఇందువల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్, విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం–ఆర్‌డీఎస్ఎస్ పనుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు వ్యవసాయ కనెక్షన్లను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు ఈరోజు దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించగా పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లోకమాన్య బాలగంగాధర తిలక్ జయంతి ఈరోజు. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొని, "స్వరాజ్యం నా జన్మ హక్కు" అని నినదించిన బాలగంగాధర తిలక్.. 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జన్మించారు. దేశాన్ని బ్రిటిష్ వారి నుండి విముక్తం చేసేందుకు పోరాడిన లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ తో కలిసి లాల్ బాల్ పాల్ త్రయంగా పేరొందిన బాలగంగాధర తిలక్ ఆగస్టు 1, 1920లో తుది శ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 376 పాయింట్ల లాభంతో 82 వేల 563 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 106 పాయింట్ల లాభంతో 25 వేల 167 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 91,812 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఔట్ ఫ్లో లక్షా 14 వేల 709 క్యూసెక్కులుగా ఉంది. స్పిల్ వే గేటు ద్వారా 27 వేల 524 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883.80 అడుగులుగా ఉంది. ప్రాజెక్టులో నీటి నిల్వ ప్రస్తుతం 208.72 టీఎంసీలుగా ఉందని అధికారులు తెలిపారు.

మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విడుదలైన కృష్ణా జలాలు హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా అనంతపురం జిల్లాకు చేరాయి. వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద కృష్ణా జలాలకు అధికారులు, రైతులు జల హారతులు ఇచ్చారు. రాగులపాడు వద్ద జీడిపల్లి జలాశయానికి ఈరోజు పంపుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఇలా ఉండగా కృష్ణానది ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరద నీరు విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుతోంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 21 వేల క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు. సాగునీటి అవసరాల కోసం 2 వేల 623 క్యూసెక్కుల నీటిని కృష్ణా తూర్పు, పశ్చిమ కాలువల ద్వారా విడుదల చేస్తుండగా, 8 వేల 625 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నామని చెప్పారు.

=====================